# 84. హాపీ జర్నీ

"మూడో తారీకు ఉదయం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో సామర్లకోట వస్తున్నాను. నువ్వు సుమారుగా ఉదయం పదకొండు గంటల వేళకి సామర్లకోట స్టేషన్‌కి చేరుకొని వెయిటింగు రూంలో కూర్చో. మా బండికి లేటవడం అలవాటు గనక నీకు కొంత వెయిటింగు తప్పదనుకో. అయినా వెయిటింగు రూములు ఉన్నది వెయిట్ చేయడానికే కదా." ఇలా సాగింది మా బావ ఉత్తరం. ఏం లేదు. వాళ్లమ్మాయికి "సూటు" అయిన "మేచి" ఒకటి కాకినాడలో ఉందని తెలిసిందట. తీరా ఆరాతీస్తే ఆ పిల్లవాడి తండ్రి దశరథరావుగారు నాతోబాటు విశాఖపట్నంలో ఇరవై ఏళ్లు పని చేసేడనీ నామాట అంటే ఆయనకి గురి అనీ తెలిసిందట. నేను రాజమండ్రి నుంచీ తను విశాఖపట్నం నుంచీ సామర్లకోట వచ్చి ఇద్దరం కలిసి కాకినాడ వెళ్లి దశరథరావుతో ప్రాథమిక చర్చలు చెయ్యాలని మా బావ ప్రణాళిక.

మా బావ పేరు గురునాథరావు. వాళ్లింటిపేరు ఇంగ్లీషులో రాస్తే మొదటి అక్షరం 'జి' వస్తుంది. దానికి తగ్గట్టుగా అతను పట్టిన పట్టు విడవడు. అతనెప్పుడూ కుందేలును పట్టలేదు గాని ఒకవేళ పట్టి ఉంటే దానికి మూడు కాళ్లు ఉండడం ఖాయం అని సాక్షాత్తూ మా అక్కగారే అంటుంది. ఇతను పట్టుకునే లోపల ఆ కుందేలుకు ఒక కాలు విరిగిపోతుందని భాష్యం. మా బావ విశాఖపట్నం నుంచి సామర్లకోట రావడానికి సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ని ఎన్నిక చేసుకోవడంలో ఒక సూత్రం ఉంది. ఉదయం ఆరు గంటల వేళప్పుడు ఈస్టుకోస్టు ఎక్స్‌ప్రెస్ ఉన్నా, అది సామర్లకోటకి ఎనిమిది కల్లా వస్తుందని తెలిసినా అతను సింహాద్రి ఎక్స్‌ప్రెస్సే ఎందుకు ఎంచుకున్నాడంటే, ఆ బండి విశాఖపట్నం నుంచే బయలుతేరుతుంది. దాంట్లో కూర్చోవడానికి సీటు గ్యారంటీగా దొరుకుతుంది. అంతే సంగతి.

మా బావ ఏ ప్రయాణాలు చేసినా నిలబడీ, ఇరుకుగా కూర్చునీ చెయ్యడానికి ఇష్టపడడు. "ఇచ్చే డబ్బు ఇచ్చి పిచ్చివాణ్ణి పెళ్లాడిందన్నట్టు" అని సామెత చెప్తాడు. సిటీలో అయినా సరే - బస్సుకోసం ఎంతసేపైనా నిలబడతాడుగాని బస్సులోపల మాత్రం నిలబడ్డానికి అతను ఒప్పుకోడు. "వేళదాటినా ఖాళీ బస్సు నయం" అని సిద్ధాంతం చేస్తాడు.

సింహాద్రి ఎక్స్‌ప్రెస్ సామర్లకోట చేరేసరికి పదకొండు గంటలవుతుంది కదా అని నేను తొమ్మిది గంటలకు కాంప్లెక్సు చేరుకుని, సామర్లకోట రైల్వే స్టేషనుకి ఎదురుగా ఆగే బస్సు ఒకటి పట్టుకుని పదకొండు గంటలకల్లా సామర్లకోట చేరుకున్నాను. స్టేషను కొచ్చి భోగట్టా చేస్తే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఇంకో అరగంటకి రావచ్చునీ, ప్లాట్‌ఫారం మీద కోణార్క ఎక్స్‌ప్రెస్ ఉందనీ యన్‌క్వయిరీ కౌంటర్‌లో చెప్పేరు; పాపం, నేనేదో రాజమండ్రికో, విజయవాడకో వెళ్తాననుకొని కాబోలు. నేను ప్లాట్‌ఫారం టికెట్టు ఒకటి కొనుక్కుని లోపలికెళ్ళి ఒక బెంచిమీద కొంచెం చోటు చూసుకుని కూర్చున్నాను. మా జిగురు నాథం బావ సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో రాలేదు. దువ్వాడ, అన్నవరంలాంటి చిన్న చిన్న స్టేషన్లలోనే అయిదు నిమిషాలూ పావు గంటా ఆగి మరీ వెళ్లే ఆ రైలు సామర్లకోటలో ఇరవై నిమిషాలు ఆగడం వల్ల సెకండ్ క్లాసు పెట్టెలూ, ఫస్టు క్లాసు కేబిన్లూ, గార్డు పెట్టే, ఇంజను అన్నీ ఈ చివర్నించి ఆ చివరికి పరిక్రమించి పరీక్షించి

చూసినా ఈ శాల్తీ ఐపులేడు. సిద్ధంగా ఉన్న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కిపోయి రాజమండ్రికి తిరుగు ప్రయాణం కట్టేద్దునా లేకపోతే ఈ జిగురునాథం నన్ను ఎలాగా వదలడు గనుక కాకినాడ వెళ్లి, దశరథరావుగారితో ఈ సంబంధం మాట ప్రస్తావించి కొంతవరకూ కథ నడిపించ వచ్చునా- ఇలాగ హేమ్లెట్ పడ్డ అవస్థలో పడ్డాను. చివరికి ఏ నిర్ణయమూ తీసుకోకముందే ఈ బండి వెళ్ళిపోయింది.

టైమేమో పన్నెండున్నర.

"హవ్‌రా నుండి హైదరాబాదునకు పోవు ఈస్టుకోస్టు ఎక్స్‌ప్రెస్ మరికొన్ని నిమిషములలో రెండవ నెంబర్ ప్లాట్‌ఫారమునకు వచ్చును'' అని తెలుగులో ఎనౌన్సుమెంటు రావడంతో, పోనీ ఆ బండి కూడా చూసాకనే తదుపరి కార్యక్రమం రూపొందించుకుందామని కూర్చున్నాను. అరగంట అయింది కాని ఈస్టుకోస్టు రాలేదు. ఏంటిసార్, ఎనౌన్స్ చేసిన బండి అరగంటయినా రాలేదే?'' అని ఎంక్వయిరీలో అడిగాను. "మీరెప్పుడూ ఇంతే. కొన్ని నిమిషములు - అంటారే గాని-'' అని కామెంట్ కూడా చెయ్యబోయాను.

"అమ్మయ్య! ఇక్కడున్నావా?'' అని వీపు మీద ఒక దెబ్బవేసి పలకరించేడు మా గురునాథం బావ.

విశాఖపట్నంలో మా బావ రైల్వే స్టేషన్ చేరేసరికి ఏడూ నలభయ్యయిదు నిమిషాలయింది. టిక్కెట్ కొనుక్కుని మూడో నెంబరు ప్లాట్ ఫారానికి వెళ్తే ఎవరో పలకరించి 'ఈ బండి ఇంకో అరగంటకి గానీ బయలుదేరదండీ. సామర్లకోటకే కనక, అదుగో ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారం మీద కోణార్క ఎక్స్‌ప్రెస్సుంది. అదెక్కి వెళ్ళిపోండి.'' అని సలహా ఇచ్చేరు. సరే, సూపర్ ఫాస్టు చార్జి రెండు రూపాయలు కట్టేసి ఆ బండి ఎక్కేడు. అతనెక్కిన కంపార్టుమెంటు భారతదేశపు రైల్వే చరిత్రలో ఎన్నడూ ఎరగనంత ఖాళీగా ఉంది. పట్టపగలు, కింది బెర్తు మీద పడుకున్నా సరే అడిగేవాడు లేడక్కడ. సీటు దొరికితే తప్ప ప్రయాణం చెయ్యని మా బావకి అదో పెద్ద ఆకర్షణ కాగా హాయిగా కాళ్లు జాపుకుని పడుకున్నాడు. ఎంత హాయిగా అంటేనూ బండి రాజమండ్రి ఔటర్లో ఆగేదాకా మెలకువ రానంత. సరే, నెత్తీ నోరూ కొట్టుకొని రాజమండ్రిలో దిగాడు. అక్కడ ఎవర్నో మంచి చేసుకుని సామర్లకోటకి ఒక టిక్కెట్టు తెప్పించుకున్నాడు. అలెప్పీ నుంచి బొకారో స్టీల్ సిటీకి వెళ్లే సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్సూ, ఢిల్లీ (నిజాముద్దీన్) నుంచి విశాఖపట్నం వచ్చే లింక్ ఎక్స్‌ప్రెస్సూ, రెండు రైళ్లూ రెండు నిమిషాల తేడాలో రాజమండ్రి చేరాయి. సూపర్‌ఫాస్టు ముందుగా వెళ్తుంది కదా అని అదెక్కి కూర్చున్నాడు. ఇంతలో లింక్ ఎక్స్‌ప్రెస్సు ముందు బయల్దేరుతుందని ఎనౌన్సుమెంటు వినిపించి ఈ బండి దిగి ఆ బండి ఎక్కాడు. (సీటు దొరికింది!)

అలా అలా విశాఖపట్నం నుంచి సామర్లకోటకి నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎక్కి ఐదున్నర గంటలు ప్రయాణం చేసి వచ్చాడు మా బావ.

"నయం. లింక్ ఎక్స్‌ప్రెస్సులో బెర్తు నిద్రపోడానికి వీలైనంత ఖాళీగా ఉంటే విశాఖపట్నం వెళ్ళిపోయి ఉండేవాడివేమో'' అన్నాను. అమ్మాయి పెళ్లి వ్యవహారంలో తిరుగుతున్నాడు కదా, అంచేత అంతకంటె కఠినంగా మాట్లాడలేకపోయాను మరి. ★